


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




వరంగల్ | 10-03-2026 మంగళవారం | సంపుటి : 11 | సంచిక : 263 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on

# లిక్కర్ కేసు రివర్స్!

## రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుపై ఢిల్లీ హైకోర్టు స్టే

- కేజ్రీవాల్, కవిత, మనీశ్ సిసోడియా సహా మొత్తం 23 మందికి నోటీసులు
- సిబీఐ తరపున వాదనలు వినిపించిన సోలిసిటర్ జనరల్ తుషార్
- విచారణ వారం రోజులు వాయిదా



**హైదరాబాద్, మార్చి 9 (వుదయం ప్రతినిధి) :** దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేజ్రీవాల్, కవిత, మనీశ్ సిసోడియా సహా మొత్తం 23 మందికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సీబీఐ కేసులో ప్రతివాదుల నుంచి సమాధానాలు కోరింది. ఈ కేసులో నిందితులకు రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సీబీఐ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం ఢిల్లీ హైకోర్టు విచారణ జరిపింది. సీబీఐ తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తు సంస్థపై తీర్పులోప్రత్యేక కోర్టు వ్యాఖ్యలపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఈడీ కేసు విచారణ వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచిస్తూ తదుపరి విచారణ వారం రోజులు వాయిదా వేసింది. వచ్చే సోమవారం తదుపరి విచారణ చేపట్టనుంది. దీంతో మద్యం కేసులో క్లీన్ చిట్ పొందిన 23 మందికి మళ్లీ కేసు భయం పట్టుకున్నది. నిజానికి, కింది కోర్టు తీర్పు ఇచ్చిన రోజే.. సీబీఐ ఆఘమేఘాలపై హైకోర్టులో అప్పీల్ చేసింది. కేసు క్లోజ్ అవ్వకుండా.. ఇంకా ఉంది అనిపించింది.

మిగతా 2లో

# హోర్ముజ్ సంక్షోభం

## 1973 నాటికన్నా భారీ చమురు షాక్‌ను ఇస్తుందా?




**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం) :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు మరోసారి చుక్కలను అంటుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా ఉమ్మడిగా ఇరాన్‌పై దాడి చేసిన కొద్ది రోజుల్లోనే చమురు ధర బ్యారెల్‌కు 120 అమెరికన్ డాలర్లను చేరుకుంది. దీనితో పాటుగా ప్రపంచానికి చమురు సరఫరాను పూర్తిగా అడ్డుకుంటామని బెదిరింపులకు పాల్పడిన నేపథ్యంలో ధరలు అస్థిరతకు లోనవుతున్నాయి. మార్కెట్లు రోజుకు 100 మిలియన్ బారెళ్లు ఉపయోగిస్తుందని అంచనా, ఈ క్రమంలో సరఫరా లంకెలకు అంతరాయం కలిగితే ప్రధాన సమస్య ఏర్పడుతుంది.

**హోర్ముజ్ జలసంధి ద్వారా 20 మిలియన్ బారెళ్ల రవాణా..** అమెరికా ఇంధన సమాచార ప్రాధికార సంస్థ అంచనా ప్రకారం, ప్రతి రోజూ హోర్ముజ్ జలసంధి ద్వారా దాదాపు 20 మిలియన్ బారెళ్ల ముడి చమురు, పెట్రోలియం రవాణా అవుతాయి. ఇది సముద్రమార్గం ద్వారా జరిగే చమురు వాణిజ్యంలో పావు వంతు, ప్రపంచ ముడి చమురు వినియోగంలో 20శాతం. హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అయ్యే చమురు ఆసియా, చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియాలకు వస్తుంది. హోర్ముజ్‌ను పూర్తిగా మూసి వేయడం అన్నది చరిత్రలో అతిపెద్ద చమురు సరఫరా షాక్ సంభవిస్తుందని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు.

మిగతా 2లో

యుద్ధం వల్ల ద్రవ్యోల్బణం పెరుగవచ్చు : ఐఎంఎఫ్ 3

# ఏకగ్రీవం

- తెలంగాణ నుంచి సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక
- స్క్రూటినిలో తిరస్కరణకు గురైన ఇండిపెండెంట్ నామినేషన్
- ఎమ్మెల్యేల మద్దతు లేకుండా నామినేషన్ దాఖలు చేసిన సాయి
- ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్



**హైదరాబాద్, మార్చి 9 (ఎంఎస్) :** ఊహించినట్టే జరిగింది. తెలంగాణలో రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవమైంది. రాష్ట్రం నుంచి

### సిరిమంతుడు సింఘ్వీ

కాంగ్రెస్ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక దాదాపు ఖరారైంది. వీరితో పాటు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి.. నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేల మద్దతు లేకుండా నామినేషన్ వేశారు. దీంతో అతని నామినేషన్ స్క్రూటినీ దశలోనే తిరస్కరణకు గురైంది.

మిగతా 2లో

# తిరిగొచ్చిన 67 వేల మంది

## పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులపై పార్లమెంట్‌లో మంత్రి జయ శంకర్



**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం):** పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న సంక్షోభం నడుమ పౌరులకు సహాయపడేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను కొనసాగిస్తోందని, మార్చి 8వ తేదీ నాటికి యుద్ధ ప్రభావిత దేశాల నుంచి 67వేల మంది భారత జాతీయులు తిరిగి వచ్చినట్టు విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్ సోమవారం రాజ్యసభకు వెల్లడించారు. పశ్చిమాసియాలో పరిణామం చెందుతున్న పరిస్థితిని ఎగువ సభకు వివరిస్తూ, ప్రాంతీయ గగనతలాన్ని స్వల్పంగా తెరిచిన ప్రతిసారీ భారత పౌరులు తిరిగి వచ్చేందుకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని ఆయన చెప్పారు. ఎప్పుడ గగనతలాన్ని పాక్షికంగా తెరిచినా, భారత పౌరులు తిరిగి రావడానికి వీలుగా షెడ్యూల్ చేయని విమానాలతో సహా వాణిజ్య విమానాలను వినియోగాన్ని ఆమోదించి, నిర్వహించామని ఆయన అన్నారు. మార్చి 8 నాటికి, 67,000 మంది భారత జాతీయులు తోడ్పాటునందుకున్నారని అంచనా, అని విదేశాంగ మంత్రి అన్నారు.

మిగతా 2లో

# పోలీసు బలోపేతం

## జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు • సమస్య ఏంటో తెలిస్తే.. 50 శాతం పరిష్కారమైనట్టే • అవసరమైన నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం

- పోలిసింగ్'బలోపేతానికి ప్రణాళికలు
- సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్‌లో అప్‌గ్రేడ్ అవసరం
- సమస్యల అధ్యయనం, పరిష్కారానికి సీఎస్ ఆధ్వర్యంలో కమిటీ
- నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటాం
- మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు
- తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ కార్యక్రమంలో సీఎం రేవంత్





**హైదరాబాద్, మార్చి 9 (వుదయం ప్రతినిధి) :** మారుతోన్న సమాజం... దానికి తగ్గట్టు పెరుగుతోన్న నేరాలను ఛేదించేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు తమను తాము అప్ గ్రేడ్ చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో పోలిసింగ్ వ్యవస్థనూ అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. అందుకోసం సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరాన్ని సీఎం ప్రస్తావించారు. పోలీస్ శాఖ బలోపేతానికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందన్న సీఎం.. పనితీరు ఆధారంగానే పోలీసులకు పోస్టింగులు కల్పిస్తామని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో "తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ – 2026" కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలందించడం ద్వారానే పోలీసుశాఖకు గౌరవం పెరుగుతుందనే విషయాన్ని ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలని సీఎం చెప్పారు. ప్రస్తుతం కొత్త కొత్త మార్గాల్లో నేరాలు జరుగుతున్నాయనీ దీంతో పోలీసులకు సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. మనకున్న రిసోర్సుల ద్వారా మాత్రమే సాంకేతిక సవాళ్లను అధిగమించగలమని చెప్పారు. ఎక్కడైనా శాంతి భద్రతలు సరిగ్గా ఉంటేనే పెట్టుబడులు వస్తాయనే విషయాన్ని గ్రహించాలన్నారు. లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేసే క్రమంలో పోలీసులు ఎన్నో సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. కానీ ఎంత బాగా పనిచేసినా ఈ వ్యవస్థలో మొదటగా నిందించబడేది పోలీసులేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే పోలీసులు ముందుగా సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు. సమస్య అర్థమైతే సగం సమస్యను పరిష్కారం లభించినట్లేనన్నారు. దేశ జనాభాలో 2.5శాతం ఉన్న తెలంగాణ.. దేశ జీడీపీకి 5శాతం వాటాను అందిస్తోందని చెప్పారు. దేశ జీడీపీకి తెలంగాణ వాటా 10శాతానికి చేరాలనేది తమ ఆశయమని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీ అత్యంత తీవ్రమైన కాలుష్యాన్ని ఎదుర్కొంటోందనీ బెంగళూరును ట్రాఫిక్ సమస్య వేధిస్తోందన్నారు. ముంబయి, చెన్నై నగరాలు వరద సమస్యను ఎదుర్కొంటున్నాయని వివరించారు. పాలకుల దూరదృష్టి లేకపోవడంతోనే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాలు నిర్దేశించుకొని పని చేయాలని పోలీసులకు సూచించారు. ఉన్నతాధికారులు తమ కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వారి కింద పని చేసే అధికారులతో టచ్‌లో ఉండాలన్నారు. వారితో స్నేహంగా మెలిగి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ**

సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల నుంచి కొన్ని ప్రతిపాదనలు తనకు అందాయని సీఎం చెప్పారు. ఆయా ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందు కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తానని సీఎం ప్రకటించారు. మీరు చేసిన ప్రతిపాదనలపై కమిటీలో చర్చించి.. చట్టం రూపంలో అమలు చేసుకుందామన్నారు. అయితే దాని సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలన్న రేవంత్ రెడ్డి.. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలన్నారు. పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్ కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరమని సీఎం అభిప్రాయపడ్డారు. ఇతర శాఖల్లా పోలీస్ శాఖలో ఆటో మోడ్.. ఆటో ప్రమోషన్ ఉండదని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్ లో కేటాయించుకోవచ్చని సీఎం తెలిపారు.

# కడుపు తరుక్కుపోతుంది

- వెలుగుమట్ల బాధిత మహిళల దుస్థితిపై కవిత
- బాధితులను పరామర్శించిన జాగృతి అధ్యక్షురాలు
- పోలీసులు, బాధితుల మధ్య తోపులాట, కవిత అరెస్ట్
- ఉసురు తీస్తోన్న కాంగ్రెస్ పాలన
- సర్కార్ కు వెలుగుమట్ల బాధితుల ఉసురు తగులుతుంది
- రాత్రికి రాత్రే బుల్డోజర్లతో ఇళ్లను కూల్చడం దారుణం
- ఖమ్మంలో జాగృతి ఆధ్వర్యంలో ఆందోళన



**ఖమ్మం, మార్చి 9 (వుదయం ప్రతినిధి) :** వెలుగుమట్ల లో బుల్డోజర్లతో ఇళ్లను నేలమట్టం చేసిన ప్రభుత్వానికి, నాయకులకు బాధిత మహిళల ఉసురు తగులుతుందని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. సోమవారం ఖమ్మంలోని అంబేద్కర్ భవన్ లో వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. వెలుగుమట్లలో బాధితుల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందన్నారు. ఎగ్జామ్స్ సయమంలో పుస్తకాలతో సహ రాత్రికి రాత్రే బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేయటం ఆవేదన కలిగించిందన్నారు. బాధితుల ఆవేదన కొంమంది రాజకీయ నాయకులకు ఎగ్జిబిషన్ మాదిరిగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మీ ఇళ్లను కూల్చేసే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు పాపాలు కడుక్కునే ప్రయత్నం లో బాధితులకు భోజనం పెడుతున్నారన్నారు. తాను ఎక్కడున్న సరే మహిళలు, పేదల పక్షాన ఉంటానని అన్నారు.

మిగతా 2లో

### గల్ఫ్ వ్యాప్తంగా ఇరాన్ దాడులు 2

క్షిపణులు, డ్రోన్లతో హోరెత్తిస్తున్న టెహ్రాన్



### మాటల మారాఠీ రేవంత్

- మాట మారుస్తూ సీఎం పబ్బం
- ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా స్కూటీలా..?
- పేదలు, దళిత, గిరిజనులకు లేకుండా జర్నలిస్టులకు భూములా..?
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి ఆగ్రహం



2



### ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి తెలంగాణ

- అందుకు అనుగుణంగా క్రీడా విధానం
- క్రీడాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



3

### ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా ఎందుకు విడిచిపెడుతోంది?

ఇరాన్ ఆయిల్ ఎగుమతి టెర్మినల్ ఖర్గ్ పై దాడిచేస్తే ప్రపంచ చమురు మార్కెట్లు భగ్గుమంటాయి

# పశ్చిమాసియాలో రాజీపడ్డ ప్రధాని : రాహుల్



**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అమెరికా, ఇజ్రాయెల్ తో ఎలా రాజీ పడ్డారో వెల్లడిస్తుంది కనుక పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం ఆరోపించారు. పశ్చిమాసియాలో పరిస్థితి ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని, అక్కడ జరిగే వివాదం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని కాంగ్రెస్ ఎంపీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ఎంత నష్టాన్ని కలిగిస్తుంది? ఒక ప్రధాన మార్పు దిశగా పోరాటం జరుగుతోంది. ఇది మన ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. మీరు స్టాక్ మార్కెట్‌ను చూశారు. ప్రధాని మోదీ అమెరికాతో ఒప్పందంపై సంతకం చేశారు. దేశం పెద్ద దెబ్బ తినబోతోంది. కాబట్టి, దాని గురించి చర్చించడంలో వారికి సమస్య ఏమిటి? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా ముఖ్యం కాదా? ఇంధన ధర, ఆర్థిక విధ్వంసం ముఖ్యమైన చర్చనీయాంశాలు కాదా? ఇవి ప్రజా సమస్యలు, అని రాయ్ బరేలి ఎంపీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభంపై ఉభయ సభలలో చర్చ జరిగితే ప్రధానమంత్రి పార్లమెంటును ఎదుర్కోలేరని గాంధీ అన్నారు. మేము వీటిని ముఖ్యమైనవిగా భావిస్తున్నాం, చర్చను కోరుకుంటున్నాం. కానీ వారు చర్చను కోరుకోవడం లేదు ఎందుకంటే దాని నుండి ఇతర విషయాలు బయటకు వస్తాయి, ఎందుకంటే ప్రధానమంత్రి గురించి బయటకు వస్తుంది. ఆయన విషయం బట్టబయలు అవుతుంది. ఆయన ఎలా రాజీ పడ్డారు.

మిగతా 2లో

## పేరు మార్పుడి

నేను సుభాన్‌పురాన్ ప్రభాకర్ రెడ్డి తండ్రి పాత పేరు సత్య నారాయణ్ రెడ్డి హౌస్ నంబర్ 4-1-143, అత్తాపూర్, రాజేంద్రనగర్ (మండలం) రంగారెడ్డి (జిల్లా), తెలంగాణ రాష్ట్రం. నా తండ్రి పాత పేరు సత్య నారాయణ్ రెడ్డి శుభన్‌పురాన్ (కొత్త పేరు) సత్తి రెడ్డి గా మార్చుకున్నారు.



# జాతీయం- అంతర్జాతీయం



యుద్ధ నేపథ్యంలో ప్రపంచ చమురు షాక్‌ను నిర్వహణకు

## జి7 అత్యవసర సమావేశం



**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం) :**

సోమవారం గ్రూప్ ఆఫ్ సెవెన్ (జి7) ఆర్థిక మంత్రుల అత్యవసర సమావేశం జరుగనుంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెరుగుతున్న గందరగోళం మధ్య ప్రపంచ ముడి చమురు మార్కెట్లలో ఉద్రిక్తతను తగ్గించే ప్రయత్నంలో భాగంగా, వ్యూహాత్మక చమురు నిల్వలను ఉమ్మడిగా విడుదల చేసే అవకాశాన్ని ఈ సమావేశం పరిశీలిస్తుంది. యుద్ధ ప్రభావాన్ని, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై దాని ప్రభావాన్ని అంచనా వేసేందుకు అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ (ఐఇఎ_ ఇడి ఫతీహ్ బీరొల్‌కు ఆర్థిక మంత్రులు కాల్ చేసి చర్చించనున్నారు. ఈ వార్త తర్వాత, బ్రెంట్ ముడి చమురు ధరలు బ్యారెల్ 110 డాలర్లకి తగ్గాయి, అయితే డబ్ల్యుటిఐ ముడి చమురు సోమవారం ఉదయం బ్యారెల్‌కు వరుసగా 116.71 116.45 డాలర్ల నుండి దాదాపు 107 డాలర్లకి తగ్గింది.ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేయడంతో, ప్రాంతీయ ఇంధన చమురు ప్రవాహాలలో అంతరాయాలను కలిగించిన విషయం తెలిసిందే.

**ప్రతిపాదన ఏమిటి?**

వార్తల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో అంతరాయాలకు ప్రతిస్పందించడానికి ఉద్దేశించిన ఐఇఎ అత్యవసర యంత్రాంగం కింద సభ్య దేశాలు వద్ద గల పెట్రోలియం నిల్వలను సమన్వయంతో విడుదల చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు.

యునైటెడ్ స్టేట్స్ సహా మూడు జి7 దేశాలు ఈ ప్రతిపాదిత చర్యకు మద్దతు ఇస్తున్నాయని అక్కడి వర్గాలు వెల్లించాయి. దాదాపు 300 నుంచి 400 మిలియన్ బారెళ్లను సమన్వయంతో విడుదల చేయడం సముచితమని కొందరు అమెరికన్ అధికారులు వాదిస్తున్నారు. ఇది ప్రస్తుతం ఐఇఎ సభ్య దేశాల వ్యూహాత్మక నిల్వలలో ఉన్న దాదాపు 1.2 బిలియన్ బ్యారెళ్లలో 25 30% ప్రతిబింబిస్తుంది.అరబ్ చమురు ఆంక్షలు తీవ్రమైన ఇంధన కొరతకు దారితీసి, పశ్చిమ దేశాలలో చమురు ధరలు విపరీతంగా పెరిగిన తర్వాత 1974లో ఏర్పాటు చేసిన ఉమ్మడి అత్యవసర వ్యవస్థలో ఈ నిల్వలు భాగం.

**ముడి చమురు ధరలు ఎలా పెరిగాయి**

పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రతరం అయిన తర్వాత ముడి చమురు ధరలు పెరిగాయి. ఈ ఆకస్మిక పెరుగుదల ద్రవ్యోల్బణం పెరుగుదల, ప్రపంచ ఆర్థిక వృద్ధికి ముప్పు గురించి ఆందోళనను రేకెత్తించింది. బ్రెంట్ క్రూడ్ అంతర్జాతీయ బెంచ్‌మార్క్ 24% నుండి పెరిగి ఆసియా ట్రేడింగ్‌లో బ్యారెల్‌కు 116.71 డాలర్లకి పెరిగింది, అయితే యుఎస్ బెంచ్‌మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ బ్యారెల్‌కు 28% పెరిగి 116.45 డాలర్లకి చేరుకుంది. చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక మార్కెట్లను అస్థిరంగా మార్చింది, సోమవారం ఆసియా ఈక్విటీలు పడిపోయాయి, యుఎస్ ఫ్యూచర్స్ కూడా తీవ్ర క్షీణతను సూచిస్తున్నాయి.

**ఎవరు ఎక్కువగా నష్టపోనున్నారు?**

భారతదేశం, చైనా, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, స్పెయిన్, ఇటలీ దేశాలు నిరంతర చమురు ధరల షాక్‌లకు గురవుతాయి. ఎందుకంటే ఈ దేశాలు భారీ స్థాయిలో ముడి చమురు దిగుమతి చేసుకునే ఆర్థిక వ్యవస్థలు. పెరుగుతున్న చమురు ధరల కారణంగా, ఇన్‌పుట్ ఖర్చులు పెరుగుతాయి. ఇది వాణిజ్య సమతుల్యతను మరింత తీవ్రంగా ప్రభావితం చేసి, ఈ ఆర్థిక వ్యవస్థలలో మరింత ద్రవ్యోల్బణ ఒత్తిడిని కలిగిస్తుంది.

**ఐఇఎ నిల్వలు ఎలా తోడ్పడతాయి**

ముందస్తు అత్యవసర సమావేశం కోసం తయారు చేసిన రహస్య పత్రం ప్రకారం, ఐఇఎ సభ్య దేశాలు సంయుక్తంగా 1.24 బిలియన్ బారెళ్ల పబ్లిక్ ఎమర్జెన్సీ నిల్వలను కలిగి ఉన్నాయి. దీనితో పాటు, పరిశ్రమ ఆధీనంలో ఉన్న నిల్వలు దాదాపు 600 మిలియన్ బారెళ్లని అంచనా, సరఫరా అంతరాయాలు మరింత తీవ్రమైతే వీటిని ఉపయోగించుకోవచ్చు. ఈ మొత్తం నిల్వలు కలిసి ఐఇఎ దేశాలలో దాదాపు ఒక నెల పూర్తి చమురు డిమాండ్‌ను, 140 రోజులకు పైగా నికర దిగుమతులను కవర్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని పత్రం పేర్కొంది. అమెరికా, జపాన్ కలిసి దాదాపు 700 మిలియన్ బారెళ్ల ప్రభుత్వ నిల్వలను కలిగి ఉన్నాయి. ఏర్పడినప్పటి నుంచి ఐఇఎ ఐదుసార్లు అత్యవసర చమురు స్టాక్‌లను ఉమ్మడిగా విడుదల చేసింది. తాజాగా, 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసినప్పుడు ఈ విడుదల జరిగింది.

పశ్చిమాసియా సంక్షోభం

## ప్రపంచ ద్రవ్యోల్బణాన్ని పెంచవచ్చు

### ఐఎంఎఫ్ అధిపతి హెచ్చరిక

**వుదయం డెస్క్, మార్చి 9 :**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా చమురు ధరలు సుదీర్ఘకాలం పాటు ఎక్కువగా కొనసాగితే, అంతర్జాతీయ ద్రవ్యోల్బణం పెరిగే ముప్పు ఉందని అంతర్జాతీయ విత్త నిధి (ఐఎంఎఫ్) అధిపతి క్రిస్టలీనా జార్జీవా సోమవారం హెచ్చరించారు.

జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక సింపోసియంలో మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక బలాన్ని ఇప్పటికే పరీక్షిస్తున్నాయని అన్నారు. మధ్య ప్రాచ్యంలో నూతన సంఘర్షణ ఈ బలాన్ని మళ్లీ పరీక్షిస్తోందని జార్జీవా అన్నారని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది.ఈ ఘర్షణ చమురు మార్కెట్లకు నిరంతర అంతరాయాలకు దారి తీస్తే, ఇందన ధరలు ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని ఆమె హెచ్చరించారు. ఏడాదిలో ఎక్కువ కాలంపాటు చమురు ధరలు 10శాతం పెరిగితే, అది ప్రపంచ ద్రవ్యోల్బణాన్ని సుమారు 40 బేసిస్ పాయింట్లకు పెంచుతుందని ఆమె హెచ్చరించారు.

ఈ నూతన అంతర్జాతీయ వాతావరణంలో అనూహ్యమైనదాని గురించి ఆలోచించి, దానికి సిద్ధంగా ఉండాలన్నది తన సూచన అని ఆమె అన్నారు. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ ఇంధన మార్కెట్లు అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో ఆమె హెచ్చరిక వచ్చింది. ఇది కీలకమైన చమురు సరఫరా మార్గాలకు అంతరాయం కలిగించడం గురించి ఆందోళనలను లేవనెత్తుతోంది.



**దీర్ఘకాలిక సంక్షోభం ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయవచ్చు: ఆర్థిక మంత్రిత్వ శాఖ**

భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ నివేదిక కూడా పశ్చిమాసియాలో దీర్ఘకాలిక సంక్షోభం విస్తృత ఆర్థిక ప్రభావాలను కలిగిస్తుందని హెచ్చరించింది, వీటిలో అధిక పెట్రోలియం ధరల కారణంగా విదేశీ మారకం రేటు, పెరుగుతున్న ద్రవ్యోల్బణంపై ఒత్తిడి కూడా ఉంటుందనిపేర్కొన్నట్టు వార్తా సంస్థ పిటిఐ నివేదించింది. మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఫిబ్రవరి నెల నెలాఖరు ఆర్థిక సమీక్ష ప్రకారం, ఈ వివాదం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలలో 20 శాతాన్ని నిర్వహించే అత్యంత కీలకమైన చమురు నాడి అయిన హార్మూజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయం కలిగించింది.

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులు ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీని హత్య చేయడంతో, అది ప్రతీకార దాడులకు దారితీసిందని, ఇది ప్రపంచ ఇంధనం, భౌగోళిక రాజకీయాలకు దీర్ఘకాలిక పరిణామాల గణనీయమైన పెరుగుదలను సూచిస్తుందని నివేదిక పేర్కొంది.

బ్రెంట్ ముడి చమురు ధరలు ఇప్పటికే బ్యారెల్‌కు దాదాపు 9 శాతం పెరిగి దాదాపు 80డాలర్లకు చేరుకున్నాయని, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ ఎన్‌జి) ధరలు దాదాపు 50 శాతం పెరిగాయని పేర్కొంది. అయితే, సంక్షోభం కొనసాగితే, అది మారకపు రేటు, కరెంట్ ఖాతా లోటుపై గణనీయమైన ప్రభావాలను చూపుతుందని, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను రేకెత్తిస్తుంది అని నివేదిక పేర్కొంది.

ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడులు భద్రమైన మార్కెట్లకు ఎగిరిపోవడంతో పాటు మూలధన ప్రవాహాలు కరెన్సీలపై ఒత్తిడిని కలిగిస్తాయని మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. అదే సమయంలో భారతదేశ స్థూల ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని, తగినంత విదేశీ మారక నిల్వలు, సాపేక్షంగా తక్కువ కరెంటు ఖాతా లోటు, స్థిరమైన ఆర్థిక వృద్ధిని సూచిస్తున్నాయని పేర్కొంది. ఈ నివేదిక భారతదేశ వాస్తవ జిడిపి వృద్ధిని 2026 కి 7.6 శాతంగా అంచనా వేసింది మరియు ఆర్థిక సంవత్సరం 27 కి వృద్ధి అంచనాలను 7 నుంచి 7.4 శాతం మధ్యకు పెంచింది.

**పాకిస్తాన్‌లో ఆందోళనలను రేకెత్తిస్తున్న ఇంధన ధరల షాక్**

కాగా, పెరుగుతున్న ప్రపంచ చమురు ధరలు ఇప్పటికే ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేయడం ప్రారంభించాయి. పాకిస్తాన్ ఇంధన ధరలను భారీగా పెంచుతున్నట్లు ప్రకటించింది, పెట్రోల్, హైస్పీడ్ డీజిల్ రేట్లను లీటరుకు 55 పాకిస్తానీ రూపాయలు పెంచింది, ఇది దాదాపు 20 శాతం పెరుగుదల. మార్చి 7 నాటికి, పెట్రోల్ ధరలు లీటరుకు రూ. 321.17కి పెరిగాయి, అయితే హైస్పీడ్ డీజిల్ ఇప్పుడు లీటరుకు రూ. 335.86కి పెరిగింది. చమురు సరఫరా మార్గాలకు అంతరాయం కలిగి, ఇంధన మార్కెట్లపై తీవ్ర వత్తిడి పెట్టిన పశ్చిమాసియాలో పెరుగుతున్న సంఘర్షణల నడుమ ఈ ధరల సవరణ వచ్చింది. పెట్రోల్ ధర ఇంత తీవ్రంగా పెరగడంతో ఇప్పటికే ధరల పెరుగుదలతో పోరాడుతున్న పౌరులలో ఆందోళన రేకెత్తించింది. చమురు ధరల పెరుగుదల మరొకసారి ద్రవ్యోల్బణ తరంగాన్ని సృష్టించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే, అధి రవాణా, లాజిస్టిక్స్ ధరలు ఆహార, నిత్యావసర ధరలను తీవ్రంగా పెంచవచ్చు. జాతీయ ఇంధన ఆర్థిక పరిస్థితులను స్థిరీకరించడానికి, ఐఎంఎఫ్ సంప్రదింపులకు సంబంధించిన అవసరాలను తీర్చడానికి ప్రయత్నిస్తున్నందున, అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరల ప్రభావాన్ని వినియోగదారులకు బదిలీ చేయడం తప్ప వేరే మార్గం లేదని పాక్ ప్రభుత్వం తెలిపింది.

## సభ అంతరాయాల పై కేంద్ర మంత్రి మండి పాటు



**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం) :**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మాన నేపథ్యంలో సభా కార్యకలాపాలకు అంతరాయాలను కలిగించడంపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ సోమవారం విరుచుకుపడ్డారు. వారికి పార్లమెంటరీ నిబంధనల గురించి అవగాహన ఉందా అని ప్రశ్నించారు.విలేకరులతో మాట్లాడుతూ, సోమవారం అజెండాలో అవిశ్వాస తీర్మానంపై చర్చ జాబితాలో చేర్చారని, తీర్మానాన్ని ప్రవేశ పెట్టేందుకు ప్రతిపక్షం సరైన ప్రక్రియను అనుసరించాలని ఆయన అన్నారు.

నేడు మనం చర్చించబోయే అంశాల జాబితాలో దీని గురించి స్పష్టంగా ప్రస్తావించారు. వారు తీర్మానాన్ని ప్రతిపాదించాలి. విధానం ఏమిటి? తీర్మానాన్ని ప్రతిపాదించినప్పుడు, 50 మంది దానికి మద్దతుగా నిలబడాలి...మీరు తీర్మానాన్ని ప్రతిపాదించాలనుకుంటే, నేను చర్చకు అనుమతిస్తాను అని పదే పదే నేడు స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్, చెప్పారని ప్రహ్లాద్ జోషి అన్నారు. స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం అజెండాలో ఉన్నప్పుడు, మధ్యలో మరో తీర్మానాన్ని, మరో వాయిదా తీర్మానాన్ని ఎలా తీసుకువస్తారు? ఏదైనా నియమం ఉందా లేదా? రాజ్యాంగం లేదా? రాహుల్ గాంధీ చెప్పినట్లుగా మనం సభను నడపవలసి వస్తే, ఇక నియమాలు ఎందుకు? ఈ వ్యక్తులు ముందుగా డిమాండ్ చేసి, తరువాత అంతరాయం కలిగించడం ఎలాంటి సిద్ధాంతం? నేను పార్లమెంట్ వ్యవహారాల మంత్రిగా ఉన్నప్పుడు ఇది చాలాసార్లు జరిగేది... వారు చెప్పేదే నియమమని వారు నమ్ముతారు. చర్చించాల్సినది ముందుగా బిఎసిలో నిర్ణయం కావాలి, అని ఆయన అన్నారు.

## సిఇసి గ్యానేష్‌కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు




**కోల్‌కత, మార్చి 9 (వుదయం) :**

దక్షిణ కోలకతలోని కాళీఘాట్ ఆలయ సందర్శన సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ సోమవారం నిరసనలను ఎదుర్కొన్నారు. సిఇసి కుమార్ ఆలయానికి విచ్చేయడంతోనే నిరసనకారులు నల్ల జెండాలు ఊపుతూ, గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అక్కడ ఉన్న పోలీసు సిబ్బంది జోక్యం చేసుకుని, పరిస్థితిని నియంత్రణలోకి తీసుకువచ్చి, ఆయన సందర్శన కొనసాగేందుకు మార్గం సుగమం చేశారు.

**విమానాశ్రయంలో కూడా అటువంటి ప్రదర్శనలే**

ఆదివారం రాత్రి గ్యానేష్ కుమార్ నగరానికి విచ్చేయగానే ఇటువంటి నిరసనలే చోటు చేసుకున్నాయి. ఆయన కాన్వాయ్ విమానాశ్రయం నుంచి బయటకు రాగానే తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అలాగే, విఐపి రోడ్డులో గల కాయిఖాలి ప్రాంతం నుంచి ఆయన కాన్వాయ్ వెడుతుండగా కార్యకర్తలు నల్లజెండాలు ఊపారు. వామపక్షాలకు చెందిన కార్యకర్తలు కూడా విమానాశ్రయం బయట ప్రదర్శన చేసి, ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పెంచారు. పరిస్థితిని తక్షణమే అదుపులోకి తెచ్చి, మరింత తీవ్రం కాకుండా అడ్డుకున్నట్టు పోలీసులు తెలిపారు.

**బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సిఇసి కోల్‌కత పర్యటన**

రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుమార్ మూడు రోజుల పర్యటన కోసం తగిన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లైన ఎస్ఎస్ సంధు, వివేక్ జోషిలతో కలిసి ఎన్నికల సంసిద్ధతను సమీక్షించేందుకు వచ్చారు.అనంతరం, గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలతో సమావేశమై, ఎన్నికల నిర్వహణకు సంబంధించి వారి ఆందోళనలు, సూచనలను భారత ఎన్నికల కమిషన్ పూర్తి స్థాయి బెంచి విననుంది. ఈ బృందం ఎన్‌ఫోర్స్ మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులతో కూడా సంభాషణలు నిర్వహించనుంది. సీనియర్ పోలీసు, పరిపాలనా అధికారులతో వివరణాత్మక సమీక్ష సమావేశాన్ని నిర్వహించనుంది.

**చివరి రోజు సమావేశాల షెడ్యూల్**

సందర్శన చివరి రోజు మంగళవారం, ఇసి ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్, సిఎపిఎఫ్ నోడల్ అధికారిని కలవనుంది. కుమార్ , కమిషన్ బృందం బూత్‌స్థాయి అధికారులతో కూడా సంభాషించి, విలేకరుల సమావేశం నిర్వహించి పర్యటనను ముగించనున్నారు.

## భారతీయులను తీసుకురావడానికి ప్రయత్నాలు

**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం) :**

యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో చిక్కుకుపోయిన భారతీయులను వెనక్కి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రయత్నిస్తోందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జయశంకర్ పార్లమెంటుకు వెల్లడించారు. ఇరాన్ యుద్ధ నేపథ్యంలో ఆయన పార్లమెంటుకు పరిస్థితిని వివరిస్తూ, ఉద్రిక్తతలను తగ్గించడం, సంయమనం, పౌరుల భద్రతను సమర్థిస్తూ.భారత్ శాంతికి కట్టుబడి ఉందని, చర్చలు, దౌత్యానికి మద్దతు ఇస్తోందని వివరించారు. పశ్చిమాసియాలో వివాదం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నిరంతరం పరిస్థితిని అంచనా వేస్తోందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారని జైశంకర్ అన్నారు. ప్రధానమంత్రి ఉద్భవిస్తున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నారని, సంబంధిత మంత్రిత్వ శాఖలు సమర్థవంతమైన ప్రతిస్పందనలను



నిర్ధారించడానికి సమన్వయం చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు.కొనసాగుతున్న వివాదం భారతదేశానికి ప్రత్యేక ఆందోళన కలిగిస్తోంది.గల్ఫ్‌లో కొనసాగుతున్న వివాదం భారతదేశానికి ప్రత్యేక ఆందోళన కలిగిస్తుందని జైశంకర్ పార్లమెంటుకు తెలిపారు.

పొరుగు ప్రాంతం, పశ్చిమాసియా స్థిరంగా ఉండేలా చూసుకోవడంలో మాకు స్పష్టమైన బాధ్యత ఉంది. గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న, పనిచేసే భారతీయులు దాదాపు కోటి మంది ఉన్నారు. ఇరాన్‌లో కూడా, చదువు లేదా ఉపాధి కోసం కొన్ని వేల మంది భారతీయులు ఉన్నారని ఆయన అన్నారు.

ఈ ప్రాంతం మన ఇంధన భద్రతకు కీలకమైనది. చమురు, గ్యాస్ ముఖ్య సరఫరాదారులను కలిగి ఉంది. తీవ్రమైన సరఫరా గొలుసు అంతరాయాలు, అస్థిర వాతావరణం ప్రధాన ఆందోళనగా పరిణమించాయని ఆయన అన్నారు. ఈ సమయంలో నాయకత్వ స్థాయిలో ఇరాన్‌తో సంబంధాలు కష్టంగా ఉన్నాయని, అయితే తాను ఇరాన్ విదేశాంగ మంత్రితో మాట్లాడానని జైశంకర్ అన్నారు. ఐఆర్ఐఎస్ లవణ్ విషయంలో భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఇరా న్ యుద్ధనౌక ఐఆర్ ఎస్ లవణ్‌ను కొచ్చి ఓడరేవులో నిలపడానికి అనుమతించిన మానవతావాద చర్యకు ఇరాన్ విదేశాంగ మంత్రి భారతదేశానికి కృతజ్ఞతలు తెలిపారు అని ఆయన అన్నారు.సంఘర్షణ మరింత తీవ్రమైంది, ఈ ప్రాంతంలో భద్రతా పరిస్థితి గణనీయంగా క్షీణించింది. ఈ వివాదం ఇతర దేశాలకు వ్యాపించి విధ్వంసం పెరుగుతోంది. ఈ ప్రాంతంలో సాధారణ జీవితం, కార్యకలాపాలు స్పష్టంగా ప్రభావితమవుతున్నాయి అని ఆయన అన్నారు.ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులను ప్రారంభించడంతో పశ్చిమాసియాలో పరిస్థితి తీవ్రమైందని అన్నారు. ఇరాన్ అధ్యక్షుడు ఒక టెలివిజన్ ప్రసంగంలో, దాడులకు సంబంధించి పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పినప్పటికీ, ఈ దాడులు జరిగాయి.

## భారత్‌లో 53కు పెరిగిన చిరుతలు

### భారత్‌లో పుట్టిన కూనల సంఖ్య 33కు చేరిక



**న్యూఢిల్లీ, మార్చి 9 (పిఐబి) :**

నమీబియా నుంచి రప్పించిన చీతా, 'జ్వాల' మధ్యప్రదేశ్‌లోని కూనో అభయారణ్యంలో అయిదు కూనలకు జన్మనిచ్చిందనీ, ఇది 'జ్వాల' విజయవంతంగా మూడోసారి తల్లి అయిన సందర్భమనీ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ సోమవారం ప్రకటించారు. సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ లో మంత్రి ఒక సందేశాన్ని పోస్ట్ చేస్తూ, ప్రస్తుతం భారత్‌లో పుట్టి పెరుగుతున్న చిరుతల కూనల సంఖ్య 33కు పెరిగినట్లు పేర్కొన్నారు. భారత్ గడ్డ మీద ఇప్పటి వరకు 10 చిరుత కూనలు పుట్టాయనీ, ఇది భారత్ చిరుతల సంరక్షణ ప్రస్థానంలో కీలక పురోగతిని సూచిస్తోందనీ ఆయన తెలిపారు.

'ప్రాజెక్ట్ చీతా'లో ఇది ఓ గర్వకారణ ఘట్టమని శ్రీ యాదవ్ వర్ణించారు. పశు వైద్యులు, క్షేత్ర ఉద్యోగులతో పాటు అవిశ్రాంతంగా పనిచేస్తున్న ఇతర సిబ్బంది ఎంతో అంకిత భావంతో చేస్తున్న కృషికీ, వారి నేర్పరితనానికీ, నిబద్ధతకీ ఇది అద్దం పడుతోందని ఆయన అన్నారు.

ఈ కూనల రాకతో, భారత్‌లో మొత్తం చిరుతల సంతతి 53కు చేరుకొందని మంత్రి వివరించారు.

వన్యప్రాణి సంరక్షణలో ఇది చరిత్రాత్మక క్షణమే కాక ఆనందదాయక క్షణం కూడా అని మంత్రి వర్ణించారు. తల్లి చిరుతతో పాటు కూనలు కూడా ఆరోగ్యంగా ఉన్నాయనీ, సంతతిని వృద్ధి చేసుకుంటాయనీ, భారత్ చిరుత గాథలో మరిన్ని విజయాలకు బాట వేయగలవన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

దక్షిణాఫ్రికా చిరుత 'గామిని' ఇటీవల రెండోసారి కాన్పులో నాలుగు కూనలకు జన్మనిచ్చింది. 2026 ఫిబ్రవరి 28న, బోట్‌స్వానా నుంచి అందుకున్న తొమ్మిది చిరుతలను కూనో నేషనల్ పార్కులో కంచెలున్న ఆవరణాల్లోకి విడిచిపెట్టారు. వాటిలో ఆడ చిరుతలు 6, మగ చిరుతలు 3 ఉన్నాయి. అవి మారిన పరిస్థితులకు మెల్ల మెల్లగా అలవాటు పడుతున్నాయి. వాటి స్వస్థతను పర్యవేక్షించే దశ సమాప్తమైన తరువాత క్రమంగా ప్రాకృతిక వాతావరణంలోకి వదలిపెడతారు

## ఖర్గ్ ద్వీపాన్ని ఎందుకు టచ్ చేయడం లేదు?

**(వుదయం డెస్క్) :**

తీవ్రత తగ్గే సూచనలు లేకుండా మధ్య ప్రాచ్యంలో యుద్ధం కొనసాగుతోంది. ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులు చేసింది. దాని అణు స్థావరాలు, చమురు కేంద్రాలు, ఇతర వ్యూహాత్మక ఆస్తులను లక్ష్యంగా చేసుకుంది. కానీ, ఆసక్తికరంగా, ఉత్తర గల్ఫ్‌లోని ఒక చిన్నద్వీపంపై ఇప్పటి వరకు అమెరికన్ దళాలు దాడి చేయలేదు. వివాదం పెరిగే కొద్దీ ఖర్గ్ ద్వీపం అత్యంత సున్నితమైన, దుర్బలమైన లక్ష్యాలలో ఒకటిగా పరిగణిస్తున్నారు.

**ఖర్గ్ ద్వీపం ఏమిటి?**

ఇరాన్ తీరానికి 25 కి.మీ దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ ప్రధాన ముడి చమురు ఎగుమతి టెర్మినల్. ఇది 1960ల నుండి అత్యధిక స్థాయిలో చమురు రవాణాను నిర్వహిస్తోంది. ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక ప్రకారం, ఇరాన్ వైమానిక దాడులకు గురైనప్పటికీ, ద్వీపం సౌకర్యాలు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది..విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఖర్గ్ దెబ్బతింటే, ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది, కానీ అదే సమయంలో ఘర్షణ భారీగా పెరగడానికి దారితీసి ప్రపంచ చమురు మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.

ఖర్గ్ ద్వీపం కొన్ని కిలోమీటర్ల పొడవు మాత్రమే ఉంది. ఈ చమురు ఎగుమతి కేంద్రాన్ని యుఎస్ చమురు కంపెనీ అమోకో సహాయంతో అభివృద్ధి చేశారు. ఇది 1960ల నుండి ఇరాన్ ప్రధాన ఎగుమతి కేంద్రంగా పనిచేస్తోంది. ప్రస్తుతం, ఖర్గ్ రోజుకు 7 మిలియన్ బ్యారెళ్ల చమురును లోడ్ చేయగల సామర్థ్యాన్ని




కలిగి ఉంది, అందువల్ల, ఇది ఇరాన్ ముడి ఎగుమతులకు వెన్నెముకగా నిలిచింది. సబ్‌సీ పైప్‌లైన్‌లు ద్వీపాన్ని దక్షిణ ఇరాన్‌లోని చమురు క్షేత్రాలకు అనుసంధానిస్తాయి. సూపర్ ట్యాంకర్లు ముడి చమురును లోడ్ చేయడానికి వీలుగా పొడవైన జెట్టీలు లోతైన నీటిలోకి విస్తరించి ఉన్నాయి, అయితే పెద్ద నిల్వ ట్యాంకులు, కార్మికుల గృహాలు ద్వీపం దక్షిణ ప్రాంతంలో ఎక్కువ భాగాన్ని కవర్ చేస్తాయి. ఇరాన్ తీరప్రాంతంలో ఎక్కువ భాగం ప్రపంచంలోని అతిపెద్ద చమురు ట్యాంకర్లకు సౌకర్యవంతమైన లోతును కలిగి ఉండదు. అందువల్ల, ఖర్గ్ ద్వీపం ఒక కీలకమైన ఎగుమతి కేంద్రంగా మారింది. విదేశాలలో విక్రయించే ప్రతి 10 బ్యారెళ్ల ఇరానియన్ చమురులో తొమ్మిది బ్యారెళ్లు ఈ ద్వీపంలోనే లోడ్ అవుతున్నాయి. ఇరాన్ వైమానిక దాడులను ఎదుర్కొన్నప్పటికీ టెర్మినల్ పనిచేస్తుందని ఉపగ్రహ చిత్రాలు సూచిస్తున్నాయి.

**ఆ ద్వీపంపై ఎందుకు దాడి జరగలేదు?**

ఇరాన్ సైనిక సౌకర్యాలు, ఇంధన గిడ్డంగులపై అమెరికా దాడి చేసినప్పటికీ, ఖర్గ్ ద్వీపాన్ని ఇంకా తాకలేదు. అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై వైమానిక దాడులు ప్రారంభించిన రెండు రోజుల తర్వాత ఇరాన్ తన ఖర్గ్ ద్వీపం ఎగుమతి టెర్మినల్‌లో ముడి చమురును లోడ్ చేస్తోందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక ఉపగ్రహ చిత్రాలను చూపుతూ తెలిపింది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఖర్గ్ ద్వీపంపై దాడి చేయడం యుద్ధం దిశను మార్చవచ్చని, గల్ఫ్ దేశాల చమురు మౌలిక సదుపాయాలపై ఇరాన్ ప్రతీకార దాడులకు పాల్పడవచ్చని అమెరికా, ఇజ్రాయెల్‌లకు తెలుసు.

ఖర్గ్ దీవిని తాకకుండా వదిలేయడం వెనుక ఉన్న మరో అంశం ఏమిటంటే, అటువంటి దాడి ప్రపంచ చమురు మార్కెట్లపై కలిగించే పరిణామాలు. యుద్ధ తీవ్రత చమురు ధరలు విపరీతంగా పెరగడానికి, ప్రపంచ ఇంధన సరఫరా గొలుసులలో అంతరాయాలకు దారి తీయవచ్చు. అందువల్ల, ఖర్గ్ ద్వీపం అమెరికాకు ఒక రెడ్ లైన్ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.






"భారతదేశం శాంతివైపు దృఢంగా నిలబడి ఉంది. యుద్ధాన్ని వీడి చర్చలు, దౌత్యం దిశగా మళ్లాలని కోరుకుంటున్నది. ఉద్రిక్తతల సడలింపు, నిగ్రహం పాటింపు, పౌరుల రక్షణకు హామీ ఇవ్వడం అనేవి ఇండియా ఇష్టపడే అంశాలు. ప్రధాని మోడీ యుద్ధ పరిస్థితిని, పరిణామాలను శ్రద్ధగా పరిశీలిస్తున్నారు. పశ్చిమాసియా సుస్థిరంగా ఉండాలని కోరుకుంటున్నాం. గల్ఫ్ దేశాలలో గల లక్షలాది మంది భారతీయుల గురించి ఆందోళన చెందుతున్నాం. యుద్ధం ఇరాన్ నాయకులు సహా అనేకమంది ప్రాణాలను బలితీసుకున్నది. ఈ ప్రాంతంలోని అన్ని దేశాల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాలను గౌరవించడం అవసరం. ప్రాంతీయ భద్రత, ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలకు కలిగే హాని గురించి, భారత సంతతి, భద్రత గురించి ఈనెల 1న సమావేశమైన భద్రత వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. గల్ఫ్ ప్రాంతం భారతదేశానికి అతి ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి ఆ ప్రాంతంతో ఇండియా యేటా 200 బిలియన్ అమెరికన్ డాలర్ల కిమ్మత్తు వ్యాపారం చేస్తుంది. ( – పార్లమెంట్‌లో విదేశాంగ మంత్రి జయశంకర్)"

## వే'మన'పద్యం



**పూజకన్న నెంచ బుద్ధి ప్రధానంబు**
**మాటకన్న నెంచ మనసు దృఢము**
**కులముకన్న మిగుల గుణము ప్రధానంబు**
**విశ్వదాభిరామ! వినురవేమ**

## సంపాదకీయం

# ముర్ము ప్రోటోకాల్ వివాదం

ఎన్నిల వేళ ఈనిపుల్ల కూడా మహాస్త్రం రూపెత్తుతుంది. గులక రాయి సైతం శత్రువుపై సంధించ దగిన మహాయుధంగా మారిపోతుంది. త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న బెంగాల్ లో ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ కార్యక్రమం ఎంత అభాసపాలవుతున్నదో చూస్తూనే ఉన్నాము. బెంగాల్ లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సంతాల్ సదస్సు కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెళ్లారు. ఆ సందర్భంలో ప్రోటోకాల్ విధివిధానాల ప్రకారం ఆమె కు ఇవ్వాల్సిన గౌరవాన్ని ఇవ్వకుండా ముఖ్యమంత్రి మమత బెనర్జీ నిర్లక్ష్యం వహించారనే విమర్శ వినవస్తున్నది. ప్రధాని నరేంద్రమోడీ సహా అనేక మంది బిజెపి పెద్దలు, చిన్నలు మమత మీద విరుచుకుపడుతున్నారు. కారాలు మిరియాలు నూరుతున్నారు. కొందరైతే ఆమె రాజీనామా ను డిమాండ్ చేశారు. మమత ప్రభుత్వం తీరును రాష్ట్రపతి ముర్ము స్వయంగా నిరశించారు. మొన్న శనివారం నాడు డార్జిలింగులో తనకు స్వాగతం చెప్పడానికి గవర్నర్ గాని ముఖ్యమంత్రి గాని మంత్రి గాని రాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మమత బెనర్జీని సోదరి అంటూనే ముర్ము తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇందులో తన తప్పు ఏమీ లేదన్న బెనర్జీ అది ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహించిన కార్యక్రమం అని అన్నారు. బిజెపి మాటలు విని రాజకీయం చేయొద్దని రాష్ట్రపతికి మమత హితవు చెప్పే వరకు వ్యవహారం వెళ్ళింది. ఈ విషయంలో నరేంద్ర మోడీ స్వయంగా అగ్గి మీద గుగ్గిలమైపోవడం లో ప్రధానిగా తనపై గల విధ్యుక్త ధర్మం వల్ల కొంత, ఎన్నికల అవసరం వల్ల మరికొంత కావచ్చు. అయితే గతంలోకి వెళ్ళి చూస్తే ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విషయంలో ఎన్ డి ఎ ప్రభుత్వం కూడా నియమబద్ధంగా వ్యవహరించ లేదనే విమర్శ ముందుకు వస్తుంది. పార్లమెంట్ నూతన భవనాల ప్రారంభోత్సవం సమయంలో ప్రధాని మోడీ ప్రభుత్వం రాష్ట్రపతి ముర్మును అవమానించలేదా అనే ప్రశ్నను పూర్తి నిరాధారమైనదని కొట్టిపారేయలేము. ఆమె ఆదివాసీ కావడం వల్లనే ఆమె చేత పార్లమెంట్ నూతన భవనాల ప్రారంభోత్సవాన్ని జరిపించలేదని ప్రతిపక్షాలు విమర్శించాయి. రాజ్యాంగం 79వ ఆర్టికల్ ప్రకారం పార్లమెంటుకు అధిప తి రాష్ట్రపతి అని అవి గుర్తుచేశాయి. దేశ జనాభాలో అత్యధికులుగా గల శ్రామిక, సేవక వృత్తుల మహాజ నం, ఎస్ టి, ఎస్ సి, బి సి లు, మైనారి టీలు నిరక్ష రాస్యులుగా, ప్రజాస్వామ్య చైతన్యం బొత్తిగా కొరవడి కొనసాగుతున్న నేపథ్యంలో దేశాధికా రం వారికి అందడంలేదు. ఈ విషయాన్ని కప్పి పుచ్చడాని కే వారి ప్రతినిధులకు రాష్ట్రపతులుగా ఉపారాష్ట్రపతులు గాను తదితర నామమాత్రపు పదవుల్లో నియ మించే కం టి తుడుపు కార్యక్రమం సాగుతున్నది. ఈ నేప థ్యంలోనే బిజెపి అయినా, కాంగ్రెస్ అయినా, తృణమూల్ కాంగ్రెస్ అయినా వారిని ఉత్సవ విగ్రహాలుగా చూసి అవమానిస్తున్నాయి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# అమెరికా ఎత్తుగడలను చిత్తుచేస్తున్న ఇరాన్

ఓ దేశాధినేతను ఏదో విధంగా తమ చేతుల్లోకి తెచ్చుకుంటే లేదా బంధిస్తే లేదా పదవి నుండి తొలగిస్తే లేదా చంపివేస్తే ఇక ఆ దేశంలోని నాయకత్వం, ప్రభుత్వం తమ ఆధీనంలోకి వచ్చినట్లే అనే అభిప్రాయంలో అమెరికా ఇప్పటివరకు ప్రపంచాధిపత్యం వహిస్తూ వచ్చింది. అయితే, బహుశా మొదటిసారిగా ఇరాన్ లో ఆ దేశం ఎత్తుగడలు చిత్తవుతున్నాయి. మొదటిరోజునే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలి ఖమేనీతో పాటు కీలకమైన 40 మందికి పైగా నాయకులను, సైన్యాధికారులు చంపివేసినా ఈ దేశం ఏమాత్రం జంకిన్నట్లు కనిపించడం లేదు. డొనాల్డ్ ట్రంప్ ఆశించినట్లు అమెరికా ముందు దాసోహం అనడం లేదు. ఇజ్రాయిల్, అమెరికా కలిసి ముప్పేట దాడులు జరుపుతున్నా, అత్యాధునిక ఆయుధాలను ప్రయోగిస్తున్న తాము తయారుచేసుకున్న చిన్నపాటి ఆయుధాలతో తీవ్ర ప్రతిఘటన ఇస్తున్నాయి. పది రోజుల తర్వాత భూతాల దాడుల గురించి ట్రంప్ సమాలోచనలు జరుపుతున్నట్లు వార్తలు వస్తుండటం గమనిస్తే క్షిపణి దాడులను ఇరాన్ ను దారిలోకి తెచ్చుకోలేమని గ్రహించినట్లు స్పష్టం అవుతుంది. నాలుగైదు రోజుల పాటు యుద్ధం చేస్తే ఇరాన్ లొంగిపోతుందని ట్రంప్ అనుకున్నారు. కానీ ఆ దేశం రెండేళ్లవరకు యుద్ధం సాగించగల సామర్థ్యం తమకు ఉన్నట్లు సంకేతాలు ఇస్తున్నది. అయితే, అటు అమెరికాకు గాని, ఇటు ఇజ్రాయిల్ కు గాని అంత సుదీర్ఘకాలం యుద్ధం చేసే శక్తిసామర్థ్యాలు లేవని వారి మాటలు వెల్లడి చేస్తున్నాయి. 30 వేల అడుగుల ఎత్తులో ఆకాశం నుండి క్షిపణులు ప్రయోగించి ఇరాన్ అగ్రనాయకత్వాన్ని చంపివేసినంత తేలికగా అక్కడి ప్రభుత్వాన్ని స్వాధీనంలోకి తెచ్చుకోలేమని, తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేమని ఇప్పుడు గ్రహిస్తున్నారు. గత 20 ఏళ్లుగా అమెరికాతో యుద్దానికి ఇరాన్ సిద్ధపడుతోంది. అమెరికా కేవలం ఆర్థిక ఆంక్షలతో, బెదిరింపులతో స్వాధీనంలోకి తెచ్చుకొనే విఫల ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. ముఖ్యంగా గత ఏడాది జూన్ లో 12 రోజులపాటు జరిగిన యుద్ధం ద్వారా అమెరికా, ఇజ్రాయిల్ బలాలు, బలహీనతలపై ఇరాన్ ఓ అంచనాకు వచ్చింది. అప్పటి నుండే యుద్ధంకు సన్నాహాలు ప్రారంభించింది. తనను చంపటమే అమెరికా మొదటి లక్ష్యం అని ఖమేనీ ముందే గ్రహించారు. తాను చనిపోయినా అమెరికా వత్తిడులకు లొంగని నాయకత్వాన్ని ఆయన నిర్మించుకుంటూ వచ్చారు. అటువంటి ప్రణాళికలు, సన్నాహాలు అమెరికా, ఇజ్రాయిల్ లలో కనిపించడం లేదు. పైగా, అమెరికా సైన్యం 'ప్రచ్ఛన్న శీతల యుద్ధం' కాలంలో పోరాడే విధంగా, ఆధిపత్యం కోసం, కందరాలను వంచడానికి, తమ ఆర్థిక-సైనిక బాలలను చూపి బెదిరింపులతో లొంగదీసుకోవడానికి పేరొందింది. అమెరికన్ సైన్యం 21వ శతాబ్దపు ఆధునిక యుద్ధంతో పోరాడటానికి సిద్ధంగా లేదని పలువురు నిపుణులు భావిస్తున్నారు. అదీగాక, భారీ అమెరికా యుద్ధ యంత్రాంగం ఖరీదైనది. అది నిదానంగా, నెమ్మదిగా కదిలేది. వేగంగా, ప్రత్యర్థుల ఎత్తుగడలను తిప్పికొట్టే విధంగా తిరగబడే స్వభావం దానికి లేదు. బలప్రదర్శనతో విర్రవీగడమే గాని వ్యూహాత్మకంగా అడుగులు వేసే అలవాటు లేదు. వీటన్నిటితో పాటు, అమెరికా సైన్యం అవినీతికి పేరొందింది. పెంటగాన్, జనరల్స్ ముడుపులు తీసుకొని ఆయుధాలు, యుద్ధ పరికరాలను అప్పగించడంపై ఎక్కువగా ఆసక్తి చూపుతూ ఉంటారు. ప్రస్తుత యుద్ధంలో అమెరికా కన్నా ఇరాన్ వ్యూహాత్మకంగా ముందంజలో ఉందని ట్రంప్ వ్యవహారాలపై నిశితంగా అధ్యయనం జరుపుతున్న ప్రొఫెసర్ జియాంగ్ జోక్విన్ తెలిపారు.



"వాస్తవం ఏమిటంటే, ప్రస్తుతం ఇది అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం. ఇరానియన్లు ఈ సంఘర్షణకు 20 సంవత్సరాలుగా సిద్ధమవుతున్నారు. వారి మతంలో, ఇది గొప్ప సాతానుకు వ్యతిరేకంగా జరుపుతున్న యుద్ధం. అందుకు చాలాకాలంగా సిద్ధమవుతున్నారు. గత జూన్‌లో 12 రోజుల యుద్ధం సమయంలో ఇరానియన్లు ఇజ్రాయెల్, అమెరికన్ల సామర్థ్యాలను పరిశీలించి విశ్లేషించగలిగారు. ఈ కొత్త దాడికి పూర్తిగా సిద్ధం కావడానికి వారికి చాలా ఎక్కువగా ఎనిమిది నెలల సమయం లభించింది" అని ఆయన వివరించారు. సైనిక వ్యూహకర్తలు భూతల దాడులు జరిపితే వినాశకరమైనదని చెప్పినప్పటికీ, అమెరికా అధ్యక్షుడు ఇప్పటికీ అందుకు ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. ఇరాన్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, దేశ సైనిక వనరులను విస్తరించేందుకు, వాయువ్య ఇరాన్‌లోకి భూ దాడిని ప్రారంభించమని వాషింగ్టన్ ఇరాన్ బహిష్కరించిన కుర్దిష్ మిలీషియాలను ప్రోత్సహిస్తుంది. ఉత్తర ఇరాక్‌లోని సెమీ-అటానమస్ కుర్దిష్ ప్రాంతంలో ఉన్న ఇరానియన్ కుర్దిష్ జాతీయవాద సమూహం నాయకుడు ఒకరు ఇరానియన్ కుర్దులు ఇరాన్‌లోకి సరిహద్దు భూ ఆపరేషన్ నిర్వహించే "అవకాశం" ఉందని చెప్పారు. వాస్తవానికి వారు అటువంటి అవకాశం కోసం చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. అయితే, ట్రంప్ ను నమ్ముకొని నేరుగా ఇరాన్ దళాలతో పోరాడేందుకు వచ్చేందుకు కుర్దిష్ నాయకులు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తున్నది. అవసరమైన ఆధునిక ఆయుధాలు లేకపోవడమే కాకుండా, ట్రంప్ ఏమేరకు పూర్తిగా అండగా ఉంటారనే సందేహాలు వారిలో వ్యక్తం అవుతున్నాయి. అమెరికా ప్రజలలో సహితం భూతల దాడుల పట్ల తీవ్ర వ్యతిరేకత వెల్లడవుతుంది. ఒక పరిశీలకుడు చెప్పినట్లు ఇరాన్ సైనికులు, నేతలు దేశంకోసం మరణానికి సిద్ధంగా ఉన్నారు. కానీ, అమెరికా, ఇజ్రాయిల్ సిద్ధంగా లేవు. ఒక సైనికుడు, ఒక పౌరుడు మరణించినా ఆయా ప్రభుత్వాలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. ఇప్పటికే భారీ సంఖ్యలో అమెరికా సైనికులను చంపివేశామని, అనేకమందిని తమ నిర్బంధంలోనికి తీసుకున్నామని ఇరాన్ నేతలు చెబుతున్నారు. కేవలం ఆరుగురు మాత్రమే చనిపోయారని అమెరికా వాదిస్తున్నది. మరణాల సంఖ్య బైటకు వస్తే అక్కడి ప్రభుత్వాలే కూలిపోయే ప్రమాదం ఉందని వారికి తెలుసు.

### గల్ఫ్ దేశాల ఉనికికే ముప్పు

దాడులను వ్యూహాత్మకంగా గల్ఫ్ దేశాలకు ఇరాన్ విస్తరింపచేయడంతో అమెరికా ఊహించని కుదుపుకు గురయింది. ఆ దేశాలపై ఎందుకు దాడులు చేస్తున్నారో అర్థం కావడం లేదంటూ ట్రంప్ విస్మయం వ్యక్తం చేశారు. తమ రక్షణకు అమెరికా భరోసా అని గుడ్డినమ్మకంతో ఉన్న గల్ఫ్ దేశాలు ఇప్పుడు తమ విధానాలను సమీక్షించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. వందల బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టి అమెరికాతో ఏర్పర్చుకున్న భద్రతా వ్యవస్థ తమకు నిజమైన భద్రత కల్పించలేదని ఆయా దేశాలు ఇప్పుడు తెలుసుకున్నాయి. అమెరికా నుంచి కొనుగోలు చేసిన వందల బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలు వారి పౌరులకు, వ్యాపారాలకు, మౌలిక సదుపాయాలకు రక్షణ కల్పించలేక పోతున్నాయి. వైమానిక దాడుల నుండి రక్షణ కల్పించే అమెరికా ఆయుధ వ్యవస్థలను తట్టుకొని ఇరాన్ ప్రయోగించే తేలికపాటి వ్యయంతో కూడిన డ్రోన్లు ఏ విధంగా తమ దేశాలలో నష్టాలు కలిగించగలుగుతున్నాయో వారికి అర్థం కావడం లేదు. వేల మైళ్ల దూరంలోని అమెరికాను నమ్ముకోవడం కన్నా పొరుగు దేశాలతో దౌత్యపర సంబంధాలను మెరుగుపరచు కోవడమే తమకు కొండంత భరోసా ఇవ్వగలదని గ్రహిస్తున్నారు. దానితో, గల్ఫ్ దేశాలు భవిష్యత్ పొత్తుల గురించి తీవ్రంగా ఆలోచించబోతున్నాయి. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ సౌదీ అరేబియా రక్షణ మంత్రిని కలిసి 'ఇస్లామిక్ నాటో' గురించి చర్చలు జరపడం గమనార్హం. గల్ఫ్ దేశాలకు సమస్యలు చిన్న జనాభా, నిత్యావసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం, భారీగా విదేశీ కార్మికులు, పర్యాటకులపై ఆర్థిక కార్యకలాపాలు ఆధారపడటం, నీటి కోసం డీశాలినేషన్‌పై ఆధారపడటం. హోర్ముజ్ ద్వారా సురక్షితంగా చమురు ఎగుమతులు జరపడం వారికి చాలా కీలకం. ఇప్పుడు జిసిసిని సైనిక కూటమిగా బలోపేతం చేయడం వంటి కొన్ని అంశాలు పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. జిసిసి దేశాలు తమ ఆహారంలో 90 శాతం హోర్ముజ్ జలసంధి నుండి పొందుతాయి. ప్రస్తుత యుద్ధం కొనసాగితే ఇరానియన్ల నుండి సౌదీ అరేబియా, యుఎఇ, బహ్రెయిన్, ఖతార్ ఉనికి ప్రశ్నర్థకంగా మారే ప్రమాదం ఉంది. ఈ గల్ఫ్ దేశాలు నిజంగా అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన కేంద్రంగా ఉండటం గమనార్హం. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ మొత్తం కృత్రిమ మేధ పెట్టుబడులు, డేటా సెంటర్ల చుట్టూ తిరుగుతున్నది. వాటిల్లో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుండి వస్తుంది. కాబట్టి, గల్ఫ్ దేశాలు ఇకపై చమురును అమ్మలేకపోతే, అమెరికాలో ఈ పెట్టుబడులు పెట్టలేక పోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ కూడా కుప్పకూలే ప్రమాదం ఉంది. అందుకనే యుద్ధం ఆపేయమని గల్ఫ్ దేశాల నుండి అమెరికా వత్తిడులు ఎదుర్కొనే విధంగా ఇరాన్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తున్నది. మరోవంక, అమెరికా యుద్ధంలో భారీ వ్యయం ఎదుర్కోవలసి రావడం ఆ దేశం ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నది. రోజుకు 100 కోట్ల డాలర్లను (రూ. 9,000 కోట్లు) అమెరికా ఖర్చు చేసినట్లు కొన్ని అంచనాలు తెలుపుతున్నాయి. గత జూన్ లో జరిపిన యుద్ధం నుండి, తాజా యుద్ధ సన్నాహాలు వరకు అమెరికా, ఇజ్రాయిల్ రూ 3 లక్షల కోట్లకు మించి ఖర్చు చేసినట్లు భావిస్తున్నారు. ఇరాన్ చవకైన డ్రోన్లను అడ్డుకునేందుకు అమెరికా ఖరీదైన క్షిపణులను ప్రయోగిస్తున్నది. యుద్ధం ప్రారంభమైన తొలి నాలుగు రోజుల్లో ఇరాన్ దాదాపు 2,000 డ్రోన్లను ఇజ్రాయెల్‌పై ప్రయోగించినట్లు అమెరికా తెలిపింది. ఇరాన్ వద్ద అంత భారీ సంఖ్యలో డ్రోన్ల నిల్వలు ఉన్నట్లు అమెరికా, ఇజ్రాయిల్ అసలు అంచనా వేయలేకపోయారు. షహీద్ వంటి రూ.20 నుండి రూ. 30 లక్షలు ఖరీదైన ఇరాన్ డ్రోన్‌ను కూల్చివేసేందుకు అమెరికా రూ.30 నుండి రూ 50 కోట్లు విలువైన పాట్రియాట్ పీఏసీ-3 క్షిపణిని ఉపయోగిస్తున్నదని చెబుతున్నారు. ఇప్పటికే వాడిన ఆయుధాల స్థానంలో కొత్తవి రూపొందించేందుకు భారీగా ఖర్చవుతుంది. అదనంగా 3.1 బిలియన్ డాలర్లు అవసరం. రోజుకు 758 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల్ని యుద్ధంలో వినియోగిస్తున్నారు. ఫైటర్ విమానాల కోసం కూడా భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఏది ఏమైనా భారీ నష్టాలకు అధైర్యపడకుండా, అలసట లేకుండా ఎదురు దాడులకు ఇరాన్ సిద్ధపడుతూ ఉండగా, ఒకొక్క రోజు అమెరికా, ఇజ్రాయిల్ లకు చాలా భారంగా గడుస్తుంది.



చలసాని నరేంద్ర
9849569050

## నెయ్యం - కయ్యం

నిమ్మరసానికి పాలకు వైరం
ఎండతో చీకటికి శత్రుత్వం
మానవత్వంతో హింసకు గొడవ
దురలవాట్లతో ఆరోగ్యానికి కక్ష
మాటలకు నిశ్శబ్దానికి ద్వేషం
భావదారిద్ర్యానికి వివేకానికి పగ
రాజకీయాలకు నీతికి పడదు
తల్లి పాలకు కల్తీకి కుదరదు
మనిషికి మంచికీ పోరాట కుస్తీ
భూమాతకు కాలుష్యంతో కయ్యం
మానవత్వం అంటే మనిషికి కోపం !



పాటతో సరిగమపదనిలకు స్నేహం
నీడతో నాకు విడదీయరాని చెలిమి
జైలుతో నేరగాండ్లకు చుట్టరికం
కాలానికి గడియారానికి మిత్రుత్వం
పుస్తకానికి అక్షరాలతో అవిభాజ్య దోస్తీ
కవనానికి కవితా వస్తువుకు
సాన్నిహిత్యం
చెమటతో విజయానికి అనుబంధం
ఆల్కహాల్‌తో మత్తుకు గమ్మత్తు మైత్రీ
రైతుకు పాడిపంటలతో గాఢ ప్రేమ
ఆలుమగల మధ్య బేషరతు అనుబంధం
తల్లికి బిడ్డకు అద్వితీయ పేగు బంధం !

మధుపాళీ
9949700037

# భీష్ముడి మౌనం ఒక సామాజిక మచ్చ

*తన మౌనాన్ని సమర్థించుకుంటూ భీష్ముడు రెండు ప్రధాన కారణాలు చెప్పాడు. మొదటిది, నేను హస్తినాపురం ఉప్పు తింటున్నాను, వారి ఆజ్ఞకు వ్యతిరేకంగా వెళ్లలేను అన్నాడు. రెండోది, ధర్మం అనేది చాలా సూక్ష్మమైనది. యుధిష్ఠిరుడు తనను తాను ఓడిపోయిన తర్వాత నిన్ను పణంగా పెట్టాడా లేదా అనేది ధర్మ సూక్ష్మంగా తేలడం లేదు అన్నాడు. నిజానికి, భీష్ముడు చెప్పిన ఈ వాదనలు ఎంతవరకు సమంజసం? ఒక స్త్రీని బహిరంగంగా వివస్త్రను చేయాలని ప్రయత్నిస్తున్నప్పుడు, అక్కడ ధర్మం సూక్ష్మంగా ఎలా ఉంటుంది? అది పచ్చి అన్యాయం, కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్న అధర్మం. అన్నదానం తీసుకున్నంత మాత్రాన అన్యాయానికి వంత పాడటం రాజధర్మం ఎలా అవుతుంది? భీష్ముడు తన వ్యక్తిగత ప్రతిజ్ఞా ధర్మం లో చిక్కుకుపోయి, విశ్వవ్యాప్తమైన మానవత్వ ధర్మాన్ని విస్మరించాడు. భీష్ముడి జీవితమంతా త్యాగాలమయం. తండ్రి సుఖం కోసం రాజ్యం వదులుకున్నాడు, వంశం కోసం బ్రహ్మచర్యం స్వీకరించాడు. కానీ, ఈ వ్యక్తిగత నిష్ఠలు సామాజిక న్యాయం కంటే గొప్పవా? కృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లు ధర్మ సంస్థాపన అంటే కేవలం అక్షరాలను పాటించడం కాదు, సత్యాన్ని కాపాడటం. భీష్ముడు తన ప్రతిజ్ఞను కాపాడుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చాడే తప్ప, ఆ క్షణంలో తన కళ్లముందు అన్యాయానికి గురవుతున్న ఒక స్త్రీ గౌరవాన్ని కాపాడలేకపోయాడు.*

మహాభారతం కేవలం ఒక పురాణ గాథ మాత్రమే కాదు, అది మానవ మనస్తత్వ శాస్త్రానికి, నైతిక విలువల సంఘర్షణకు ఒక నిలువుటద్దం. ఆ మహాకావ్యంలో ఎన్నో మలుపులు, ఎన్నో వీరగాథలు ఉన్నప్పటికీ, వాటన్నింటినీ వెనక్కి నెట్టి నేటికీ మనల్ని కలచి వేసే ఘట్టం ద్రౌపది వస్త్రాపహరణం . నిండు సభలో, కురువృద్ధుల సమక్షంలో ఒక స్త్రీకి జరిగిన పరాభవం అది. ఆ సమయంలో గంగాపుత్రుడు, ధర్మ స్వరూపుడిగా కీర్తించబడే భీష్ముడు మౌనంగా ఉండిపోవడం చరిత్రలో అతిపెద్ద ప్రశ్నార్థకం. ఆ మౌనం సరైనదేనా? అది ధర్మబద్ధమేనా? ఈ ప్రశ్నలను నేటి ఆధునిక సామాజిక దృక్పథంతో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. మాయా ద్యూతంలో ధర్మరాజు తన సర్వస్వాన్ని కోల్పోయాడు. చివరకు తనను తాను, తన తమ్ముళ్లను, తన అర్ధాంగి ద్రౌపదిని కూడా పణంగా పెట్టి ఓడిపోయాడు. దుర్యోధనుడి ఆజ్ఞ మేరకు దుశ్శాసనుడు ఏకవస్త్ర అయి ఉన్న ద్రౌపదిని కేశాలు పట్టుకుని సభలోకి ఈడ్చుకొచ్చాడు. ఆ సభలో సామాన్యులు లేరు. సత్యవ్రతుడైన భీష్ముడు, శస్త్రశాస్త్ర కోవిదుడైన ద్రోణుడు, కులగురువు కృపాచార్యుడు, ధృతరాష్ట్ర మహారాజు వంటి ఉద్దండులు ఉన్నారు. ద్రౌపది ఆక్రందన ఆకాశాన్ని తాకింది. ఆమె వేసిన ప్రశ్న చాలా తార్కికమైనది. తనను తాను ఓడిపోయిన వ్యక్తికి, నన్ను పణంగా పెట్టే హక్కు ఎక్కడిది? అని ఆమె సభను నిలదీసింది. కానీ ఆ నిశ్శబ్దం భయంకరంగా ఉంది. విదురుడు తప్ప మిగిలిన వారందరూ తలలు దించుకున్నారు. ఆ సమయంలో భీష్ముడి మౌనం కేవలం నిశ్శబ్దం కాదు, అది అన్యాయానికి లభించిన పరోక్ష అంగీకారం. తన మౌనాన్ని సమర్థించుకుంటూ భీష్ముడు రెండు ప్రధాన కారణాలు చెప్పాడు. మొదటిది, నేను హస్తినాపురం ఉప్పు తింటున్నాను, వారి ఆజ్ఞకు వ్యతిరేకంగా వెళ్లలేను అన్నాడు. రెండోది, ధర్మం అనేది చాలా సూక్ష్మమైనది. యుధిష్ఠిరుడు తనను తాను ఓడిపోయిన తర్వాత నిన్ను పణంగా పెట్టాడా లేదా అనేది ధర్మ సూక్ష్మంగా తేలడం లేదు అన్నాడు. నిజానికి, భీష్ముడు చెప్పిన ఈ వాదనలు ఎంతవరకు సమంజసం? ఒక స్త్రీని బహిరంగంగా వివస్త్రను చేయాలని ప్రయత్నిస్తున్నప్పుడు, అక్కడ ధర్మం సూక్ష్మంగా ఎలా ఉంటుంది? అది పచ్చి అన్యాయం, కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్న అధర్మం. అన్నదానం తీసుకున్నంత మాత్రాన అన్యాయానికి వంత పాడటం రాజధర్మం ఎలా అవుతుంది? భీష్ముడు తన వ్యక్తిగత ప్రతిజ్ఞా ధర్మం లో చిక్కుకుపోయి, విశ్వవ్యాప్తమైన మానవత్వ ధర్మాన్ని విస్మరించాడు. భీష్ముడి జీవితమంతా త్యాగాలమయం. తండ్రి సుఖం కోసం రాజ్యం వదులుకున్నాడు, వంశం కోసం బ్రహ్మచర్యం స్వీకరించాడు. కానీ, ఈ వ్యక్తిగత నిష్ఠలు సామాజిక న్యాయం కంటే గొప్పవా? కృష్ణుడు భ గ వ ద్గీత లో చెప్పినట్లు ధర్మ సంస్థాపన అంటే కేవలం అక్షరాలను పాటించడం కాదు, సత్యాన్ని కాపాడటం. భీష్ముడు తన ప్రతిజ్ఞను కాపాడుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చాడే తప్ప, ఆ క్షణంలో తన కళ్లముందు అన్యాయానికి గురవుతున్న ఒక స్త్రీ గౌరవాన్ని కాపాడలేకపోయాడు. ఏ ప్రతిజ్ఞ అయినా ధర్మానికి లోబడి ఉండాలి. ధర్మాన్నే మింగేసే ప్రతిజ్ఞలు ఉంటే, వాటిని విడిచిపెట్టడమే నిజమైన వీరత్వం. కానీ భీష్ముడు ఆ వీరత్వాన్ని ప్రదర్శించలేకపోయాడు. భీష్ముడు కేవలం ఒక తాతగానో, యోధుడిగానే కాకుండా, హస్తినాపురం రాజ్యానికి రక్షకుడిగా ఉన్నాడు. ఆయన ఒక్క మాట అంటే దుర్యోధనుడు కాదు కదా, యమధర్మరాజు కూడా గడగడలాడతాడు. కానీ, ఆయన తన నైతిక అధికారాన్ని ప్రయోగించలేదు. ప్రఖ్యాత రాజనీతిజ్ఞుడు ఎడ్మండ్ బుర్క్ అన్నట్లు, చెడు గెలవడానికి మంచి మనుషులు ఏమీ చేయకుండా ఊరకనే ఉండటం చాలు. భీష్ముడు ఏమీ చేయకపోవడమే కౌరవులకు కొండంత బలాన్ని ఇచ్చింది. అధికారం ఉన్నవారు మౌనంగా ఉంటే, అది నేరస్తులకు ఇచ్చే లైసెన్స్ లాంటిది. అదే సభలో విదురుడు కూడా ఉన్నాడు. భీష్ముడితో పోలిస్తే విదురుడికి ఉన్న అధికారం తక్కువ, సామాజిక హోదా కూడా తక్కువే. కానీ, విదురుడు భయపడలేదు. నిలబడి గర్జించాడు. దుర్యోధనా! ఈ పని మానుకో, ఇది నీ వంశ నాశనానికి దారి తీస్తుంది అని హెచ్చరించాడు. విదురుడికి లేని ధర్మ సూక్ష్మం భీష్ముడికి ఎందుకు అడ్డొచ్చింది? అంటే, ఇక్కడ సమస్య ధర్మం తెలియకపోవడం కాదు, ధర్మాన్ని నిలబెట్టే నైతిక



ధైర్యం లేకపోవడం ఈ పురాణ గాథ నేటికీ సజీవంగా ఉంది. మన చుట్టూ రోజూ ఎన్నో వస్త్రాపహరణాలు జరుగుతూనే ఉన్నాయి. కార్యాలయాల్లో, ఒక ఉన్నతాధికారి తన కింద పనిచేసే మహిళను లేదా అణగారిన ఉద్యోగిని వేధిస్తుంటే, తోటి సహోద్యోగులు మాకెందుకు వచ్చిన గొడవ, మా ఉద్యోగాలు పోతాయి అని మౌనంగా ఉంటారు. ఇది భీష్ముడి మౌనానికి ప్రతీక. రాజకీయాల్లో ,ఒక నేత తప్పు చేస్తుంటే, ఆ పార్టీలోని పెద్దలు పార్టీ ప్రతిష్ట దెబ్బ తింటుంది అని మౌనంగా ఉంటారు. ఇది కూడా అదే నిశ్శబ్దం వీధుల్లో, ఒక ప్రమాదం జరిగినా, ఒక స్త్రీపై దాడి జరిగినా ఫోన్లలో వీడియోలు తీస్తారే తప్ప, అడ్డుకోవడానికి ఎవరూ ముందుకు రారు. మనందరిలోనూ ఒక భీష్ముడు ఉన్నాడు. తన వ్యక్తిగత ప్రయోజనాలు, భయాలు, కట్టుబాట్ల కోసం సత్యాన్ని బలి ఇచ్చే భీష్ముడు. కురుక్షేత్ర యుద్ధం చివరలో శరశయ్యపై పడుకున్నప్పుడు భీష్ముడు తన తప్పును అంగీకరించాడు. అధర్ముడి పక్కన కూర్చుని భోజనం చేయడం వల్ల నా బుద్ధి మందగించింది అని వ్యాఖ్యానించాడు. కానీ, ఆ పశ్చాత్తాపం ద్రౌపది పడిన అవమానాన్ని తుడిచివేయలేదు కదా! చరిత్రలో భీష్ముడు గొప్ప జ్ఞానిగా మిగిలినా, ద్రౌపది సభలో మౌనంగా ఉన్నవాడనే మచ్చ ఆయన కీర్తికి తీరని లోటు. ఈ ఘట్టంలో అసలైన హీరో ద్రౌపది. ఆమె ఎవరి కోసమో వేచి చూడలేదు. భర్తలు తలదించుకున్నారు, కురువృద్ధులు మౌనంగా ఉన్నారు. అప్పుడు ఆమె తన ఆత్మగౌరవం కోసం తానే గళమెత్తింది. ఆమె ప్రశ్నలు సభను ఉలిక్కిపడేలా చేశాయి. చివరకు పురుషుల సహాయం అందకపోవడంతో, విశ్వశక్తి అయిన కృష్ణుడిని ప్రార్థించి తనను తాను రక్షించుకుంది. స్త్రీలు తమ రక్షణ కోసం ఇతరులపై ఆధారపడకూడదని, అన్యాయం జరిగినప్పుడు గొంతు విప్పాలని ద్రౌపది నేర్పింది. నేటి మహిళలకు ద్రౌపది ఒక గొప్ప స్ఫూర్తి. భీష్ముడి మౌనం మనకు నేర్పే అతిపెద్ద పాఠం ఏమిటంటే,అన్యాయం జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండటం తటస్థత కాదు, అది కూడా ఒక నేరమే. మనం ఎంత గొప్ప మేధావులమైనా, ఎంతటి పదవుల్లో ఉన్నా, సామాజిక న్యాయం పట్ల మనకు బాధ్యత ఉండాలి. అది నా సమస్య కాదు అని మనం అనుకున్న ప్రతిసారీ, మనం ఒక అన్యాయానికి మద్దతు ఇస్తున్నట్లే లెక్క. భీష్ముడి లాంటి మహానుభావుడే తన మౌనం వల్ల చరిత్రలో విమర్శలకు గురైనప్పుడు, సామాన్యులమైన మన పరిస్థితి ఏమిటి? సమాజంలో మార్పు రావాలంటే విదురుడి లాంటి నైతిక ధైర్యం ఉండాలి. తప్పును తప్పు అని చెప్పే తెగువ ఉండాలి. భీష్ముడి మౌనం పునరావృతం కాకూడదంటే, ప్రతి ఒక్కరూ తమలోని నైతికతను నిద్రలేపాలి. మౌనం ఎప్పుడూ సమాధానం కాదు, అది కేవలం అధర్మానికి పెట్టే పెట్టుబడి మాత్రమే. గుర్తుంచుకోండి, ధర్మం అంటే కేవలం పూజలు, పునస్కారాలు కాదు. ఎదుటి వ్యక్తికి అన్యాయం జరుగుతున్నప్పుడు అండగా నిలబడటమే అసలైన ధర్మం. భీష్ముడి మౌనం నుంచి మనం నేర్చుకోవాల్సిన పాఠం ఇదే,నిశ్శబ్దం ఎప్పుడూ శాంతిని ఇవ్వదు, కొన్నిసార్లు అది విధ్వంసానికి నాంది పలుకుతుంది.



డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

